కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై విమర్శలు సరికాదు

● బీజేవైఎం నేత అరుణ్‌కుమార్

బంజారాహిల్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజకీయ లబ్ధికోసం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై కాంగ్రెస్ నేతలు పనికిమాలిన ఆరోపణలు చేస్తున్నారని బీజేవైఎం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు గందే అరుణ్‌కుమార్ మండిపడ్డారు. ఫిలింనగర్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసే కిషన్‌రెడ్డిపై విమర్శలు చేయడం దారుణమన్నారు. రాష్ట్ర సాధన కోసం పోరు యాత్ర చేపట్టి ప్రజల్లో చైతన్య దీపికను వెలిగించేందుకు కిషన్‌రెడ్డి చేసిన కృషిని ప్రజలు ఎప్పటికీ మరిచిపోరన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.9 లక్షల కోట్లకు పైగా నిధులను కేటాయించిందని.. ఇందులో రోడ్లు, రైల్వే, ఆరోగ్యం, విద్య, స్మార్ట్ సిటీల అభివృద్ధి సహా పలు రంగాలకు భారీగా ఖర్చు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.


నూతన కార్యవర్గం సభ్యులు

ఆదిత్య ఎన్‌క్లేవ్ నీలగిరి బ్లాక్ కార్యవర్గం ఎన్నిక

అమీర్‌పేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేటలోని ఆదిత్య ఎన్‌క్లేవ్ నీలగిరి బ్లాక్ భవనం ఓనర్స్ అసోసియేషన్ నూతన పాలక వర్గం బుధవారం ఎన్నికైంది. 168 ఫ్లాట్లు కలిగిన ఈ భవనం కమిటీ అధ్యక్షులుగా బి.నవీన్, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణారెడ్డి, కోశాధికారిగా హనుమంతరావు, కార్యవర్గ సభ్యులుగా కె.మనోజ్ కుమార్, బి.వెంకటరమణ, ఎన్.ఉపేందర్ రెడ్డి, జి.రాజశేఖర్ తదితరులు ఎన్నికయ్యారు.తనపై ఎంతో నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్న ఫ్లాట్ల ఓనర్లకు నవీన్ కృతజ్ఞతలు తెలిపారు.

60వ రోజుకు చేరిన అన్నదానం

అమీర్‌పేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట సైంటిఫిక్ కాలనీలోని వీరాంజనేయస్వామి, సాయి మణికంఠ దేవస్థానంలో అన్నదాన కార్యక్రమం బుధవారం నాటికి 60వ రోజుకు చేరుకుంది. సెప్టెంబర్ 20న ప్రారంభమైన అన్నదాన కార్యక్రమం జనవరి 10 వరకు కొనసాగనున్నట్లు ఆలయ ప్రధాన కార్యదర్శి కుందారం ప్రభాకర చారి వెల్లడించారు. కాగా, ప్రతిరోజూ సగటున 4 వందల మంది అయ్యప్పస్వాములు ఈ ఆలయంలో భిక్ష చేస్తున్నారు. అన్నదానంతో పాటు వసతి సౌకర్యం సైతం ఏర్పాటు చేశారు.

తులసి, ఉసిరి చెట్లకు కల్యాణం

పంజాగుట్ట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా వెంగళరావునగర్ కాలనీలోని సి-77 వీధిలో పెద్దమ్మతల్లి యువ సంకల్ప్ ఆధ్వర్యంలో బుధవారం తులసి చెట్టుకు, ఉసిరి చెట్టుకు వివాహం చేశారు. వేద పండితుల సమక్షంలో కాలనీవాసులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కాంక్షిస్తూ తులసి-ఉసిరి చెట్లకు వివాహం చేశామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుగుణ, లావణ్య, సౌజన్య, దివ్య, ఆమని, మణి, కాలనీవాసులు పాల్గొన్నారు.

జన్మదిన వేడుకల్లో ఘర్షణ.. ఇద్దరికి గాయాలు

అమీర్‌పేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జన్మదిన వేడుకల్లో జరిగిన ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాపునగర్ ఓయో టౌన్ హౌస్‌లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 19న ఓయో హోటల్ మేనేజర్, రిసెప్షనిస్టు సాయి జన్మదిన వేడుకలకు తన మిత్రుడైన జీవన్ 202, 204 రూమ్‌లను బుక్ చేశాడు. వేడుకలు ముగియగానే తన మిత్రులతో కలిసి సాయి మద్యం తాగుతున్నాడు. తెల్లవారుజామున సాయి మరో మిత్రుడు సిద్ధార్థ్ తన స్నేహితులు లోకేష్, అనిల్‌దాస్, ప్రేమ్‌తో కలిసి డోర్ కొట్టారు. తామూ మద్యం తాగుతామని చెప్పడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. సిద్ధార్థ్ మిత్రులు బీరు సీసాలతో దాడి చేయడంతో నరేష్, సాయి గాయపడ్డారు. జీవన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశారు.

పెళ్లి పేరుతో మోసం.. యువకుడిపై కేసు

యూసుఫ్‌గూడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసం చేసిన యువకుడిపై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే ఓ యువతి మూడేళ్ల క్రితం శ్రీనగర్‌కాలనీలోని ఓ బ్యూటీ సెలూన్‌లో పనిచేసేది. ఆ సమయంలో కూకట్‌పల్లికి చెందిన సివిల్ ఇంజినీర్ రావి రాకేష్‌తో పరిచయమైంది. ఈ క్రమంలో బేగంపేటలో రూమ్ తీసుకుని ఇద్దరు కొంత కాలం కలిసి ఉన్నారు. అయితే ఏడు నెలల క్రితం ఆ యువతిని రూమ్‌లో వదిలేసి రాకేష్ కూకట్‌పల్లిలోని తన సోదరి ఇంట్లో ఉంటున్నాడు. రాకేష్‌కు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో పాటు మరో యువతితో ఎంగేజ్‌మెంట్ అయిందని తెలుసుకున్న బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్వే.. గడువు లోగా కష్టమే?

● ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్లలో 50% పూర్తయిన సర్వే
● ప్రారంభం కాని ఆన్‌లైన్ ప్రక్రియ
● నిర్దేశిత సమయానికి పూర్తి చేయడంపై అనుమానాలు


జీహెచ్ఎంసీ కార్యాలయంలో సర్వే ఫారాలు భద్రపరిచిన బాక్సులు

ఖైరతాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న సమగ్రకుటుంబ సర్వే ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్లలో 50 శాతం దాటింది. సుమారు 55 శాతం ఇళ్లలో సర్వే పూర్తిచేశామని అధికారులు తెలిపారు. సర్కిల్ 17లో మొత్తం 49,403 ఇళ్లను గుర్తించగా, ఇప్పటి వరకు 28 వేలకు పైగా ఇళ్లలో 422 మంది ఎన్యూమరేటర్ల ద్వారా సర్వే పూర్తిచేసినట్లు అధికారులు వెల్లడించారు. సర్కిల్ 18 పరిధిలో 57,487 ఇళ్లను గుర్తించగా, ఇప్పటివరకు 422 మంది ఎన్యూమరేటర్ల ద్వారా 30వేలకు పైగా ఇళ్లలో సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. సర్కిల్ 17లో ప్రతిరోజూ దాదాపు 2800 ఇళ్లలో సర్వే చేస్తుండగా.. సర్కిల్ 18లో రోజూ 3200 ఇళ్లలో సర్వే చేస్తున్నారు.

గందరగోళంలో ఎన్యూమరేటర్లు..

ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన ప్రాంతాల్లో మాత్రమే సర్వే చేయాల్సి ఉంది. అయితే వారికి కేటాయించిన హద్దులు తెలియకపోవడంతో చాలా మంది ఎన్యూమరేటర్లు అయోమయానికి గురవుతున్నారు. ఇంటి నంబర్లు వరుసగా లేకపోవడం, మ్యాప్‌లలో ఇళ్లను గుర్తించలేకపోవడంతో గందరగోళానికి దారితీస్తోంది. ఒకరు ఇంటిని గుర్తించి స్టిక్కర్ వేసిన అనంతరం మరొకరు వచ్చి సర్వే చేస్తున్నారు. మరికొన్ని చోట్ల ఎన్యూమరేటర్లు సర్వేకు ఆసక్తి చూపకపోవడం, ఫారాలను నింపడం సరిగ్గా రాకపోవడంతో కొందరిని మార్చాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికే కొందరు ఎన్యూమరేటర్లు తమ టార్గెట్‌ను పూర్తి చేయడంతో.. సరిగా చేయలేకపోతున్న వారికి కేటాయించిన ఇళ్లలో సర్వే చేయాలని సూపర్‌వైజర్లు కోరుతున్నట్లు సమాచారం.

ఆలస్యమవుతోన్న ఆన్‌లైన్ ప్రక్రియ..

సర్వే ఫారాలను ఆన్‌లైన్ చేసే ప్రక్రియ సర్వే ప్రారంభమైన రెండు రోజుల్లో జరుగుతుందని అధికారులు చెప్పినప్పటికీ ఆ పరిస్థితి కనిపించడం లేదు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సాఫ్ట్‌వేర్ సిద్ధం కాకపోవడం వల్లే ఆన్‌లైన్ చేసే ప్రక్రియ ప్రారంభం కాలేదని తెలుస్తోంది. దీంతో జంట సర్కిళ్లలో పూర్తి చేసిన సర్వే ఫారాలను ట్రంక్ పెట్టెల్లో జీహెచ్ఎంసీ కార్యాలయాల్లో భద్రపరిచారు. మొత్తానికి ప్రభుత్వం ఇచ్చిన గడువు లోపు సర్వే పూర్తి చేసి ఆన్‌లైన్ చేయడం కష్టమేనని తెలుస్తోంది.


పారిశుధ్య కార్మికులకు డస్ట్‌బిన్స్ అందజేస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మి

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

అమీర్‌పేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మి పిలుపునిచ్చారు. సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లో పారిశుధ్య కార్మికులకు రిక్షాలు, డబ్బాలు, వీల్ బ్యారేజ్‌లను ఆమె అందజేశారు. చెత్తను రిక్షాలో తీసుకువెళ్లే కార్మికులకు ప్రజలు సహకరించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్ఓ చంద్రశేఖర్ రెడ్డి, కొలను బాల్ రెడ్డి, జీహెచ్ఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లక్ష్మి

నారాయణ క్రీడోత్సవాలు ప్రారంభం

సనత్‌నగర్‌లోని లేబర్ వెల్ఫేర్ సెంటర్ గ్రౌండ్స్‌లో ఎస్ఆర్‌నగర్ జోన్ నారాయణ విద్యా సంస్థల ప్రీమియర్ లీగ్ క్రీడలు బుధవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరగనున్న క్రీడోత్సవాలను స్థానిక కార్పొరేటర్ లక్ష్మి ప్రారంభించారు. నారాయణ విద్యా సంస్థల జనరల్ మేనేజర్ గోపారెడ్డి, ఏజీఎం శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో ప్రారంభమైన ఈ క్రీడల్లో అత్తాపూర్, హైటెక్ సిటీ, జూబ్లీహిల్స్, మెహిదీపట్నం, మణికొండ, ఎస్ఆర్‌నగర్, విజయనగర్ కాలనీ బ్రాంచ్‌లకు చెందిన నారాయణ పాఠశాల విద్యార్థులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 23న విజేతలకు బహుమతులు అందజేయనున్నారు.


సర్వే సిబ్బందికి సూచనలు చేస్తున్న కార్పొరేటర్

సర్వే సిబ్బందితో కార్పొరేటర్ సమావేశం

యూసుఫ్‌గూడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ బ్రహ్మశంకర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో సమగ్ర కుటుంబ సర్వే అధికారులతో సీఎన్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్వేలో సిబ్బందికి ఎదురవుతున్న సమస్యలను, సర్వే ఎంతమేర పూర్తయింది వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ సర్వేకు సహకరించి వివరాలు ఇవ్వాలని కార్పొరేటర్ వారిని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.


డీసీ జకియా సుల్తానాను సన్మానిస్తున్న భవానీశంకర్, వై.వెంకటస్వామి

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

యూసుఫ్‌గూడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తిచేయాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానాను కాంగ్రెస్ నేతలు కోరారు. కాంగ్రెస్ పార్టీ నగర కార్యదర్శి భవానీశంకర్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు వెంకటస్వామి, నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి సుభాష్‌చంద్రబోస్ నగర్, టి.అంజయ్యనగర్, నవీన్‌నగర్‌లో పెండింగ్‌లో ఉన్న కమ్యూనిటీహాళ్లు, రహ్మత్‌నగర్‌లోని బేకరీ లైన్‌లో పెండింగ్‌లో ఉన్న నాలా పనులను పూర్తి చేయాలని కోరగా.. పనులను పూర్తిచేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానాను కలిసి సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తిచేయాలని కోరారు.

ఆస్తిలో వాటాకోసం బావమరిదిపై కానిస్టేబుల్ దాడి

బంజారాహిల్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆస్తిలో వాటా ఇవ్వడం లేదని బావమరిదిపై కానిస్టేబుల్ దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. లంగర్‌హౌస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎండీ షాహీద్‌ఖాన్ తన భార్య తరపున ఆస్తి ఇవ్వాలని బావమరిది అబ్దుల్ వాహీద్‌పై ఒత్తిడి తెస్తున్నాడు. ఈ క్రమంలో 19వ తేదీన వెంకటగిరిలో అబ్దుల్ వాహీద్ తన షాపులో ఉండగా షాహీద్‌ఖాన్ వచ్చి ఆస్తి గురించి అడగడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. షాహీద్‌ఖాన్ తన చేతిలో ఉన్న హెల్మెట్‌తో అబ్దుల్ వాహీద్‌పై దాడి చేశాడు. వాహీద్ కుమారుడు అబ్దుల్ మొయిద్ ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీఎం విశ్వకర్మ యోజన
రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి ప్రాతిపాదికన అసంఘటిత రంగంలో చేతులు, పనిముట్లతో పనిచేసేవారు ప్రధానమంత్రి విశ్వకర్మయోజన కింద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమశాఖ ఉపసంచాలకులు జి.ఆశన్న సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బీసీ కులసంఘాలు, ఎన్జీఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆశన్న మాట్లాడుతూ.. కులవృత్తిదారులు, చేతివృత్తిదారులు, పనిముట్ల వృత్తిదారుల నుంచి కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద ఆర్థిక సాయం అందించేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతుందన్నారు. ఈ పథకం కింద రూ.లక్ష రుణం ఐదు శాతం వడ్డీపై ఇస్తుందని, దరఖాస్తు చేసుకున్న వారికి శిక్షణ, ఆ సమయంలో స్టైఫండ్‌తో పాటు సర్టిఫికెట్ అందజేస్తారన్నారు. ఈ రుణాన్ని 18 నెలల్లో తిరిగి చెల్లించిన వారికి మళ్లీ రూ.2లక్షలు ఇస్తారన్నారు. లబ్ధిదారుల వయస్సు కనీసం 18 సంవత్సరాలు ఉండాలని వివరించారు. ఈ పథకం కింద కుటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందని, అర్హత కలిగిన కుల వృత్తులవారు కామన్ సర్వీస్ సెంటర్‌కు వెళ్లి https://pmvishwakarma.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సర్వే ఆఫీసర్ వి.శ్రీరామ్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఇలియజ్ అహ్మద్, జిల్లా సహాయ అభివృద్ధి అధికారులు నరసింహులు, డి.కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆశన్న

పెంపుడు శునకంపై ప్రేమతో..
రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

● ఆరుగురిపై కేసు నమోదు

బంజారాహిల్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెంపుడు శునకం మీద రెండు కుటుంబాలు ప్రేమ క్రిమినల్ కేసుకు దారి తీసింది. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని ఎమ్మెల్యే కాలనీలో నివసించే చాంద్ షేక్ విదేశీ కుక్కను అల్లారుముద్దుగా పెంచుకుంటున్నాడు. పక్క ఫ్లాట్‌లో నివసించే రుచిక అగర్వాల్ అనే యువతి ఈ కుక్కపై ప్రేమ పెంచుకుంది. రుచిక కుక్కను తరచూ తన ఇంటికి తీసుకెళ్లి ఆహారం పెట్టేది. యజమాని చాంద్ షేక్ ఎక్కడికైనా వెళ్లినప్పుడు కుక్క బాగోగులు చూసుకోవడానికి రుచిక అగర్వాల్‌కు అప్పగించేవాడు. ఈ క్రమంలో 12వ తేదీ నుంచి 15 వరకు చాంద్ షేక్‌కు విదేశాల్లో పని ఉండటంతో తన కుక్కను రుచిక అగర్వాల్‌కు అప్పగించి వెళ్లాడు. అయితే చాంద్‌తండ్రి షేక్ సుభాని రుచిక ఇంటికి వెళ్లి కుక్కను తీసుకెళ్లాడు. దీంతో రుచిగా సుభానితో గొడవకు దిగింది. కుక్క కోసం రుచికతో పాటు ఆమె సోదరుడు ఆమె వద్ద పనిచేసే వికాస్, జేమ్స్, ఆమె వదిన గొడవ సుభానితో గొడవపడ్డారు. ఈక్రమంలో సుభానికి స్వల్ప గాయాలయ్యాయి. సుభాని తనను దూషించాడని రుచిక పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సుభాని కొడుకు చాంద్ షేక్ తన తండ్రిని కొట్టారంటూ ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేశారు.

వ్యభిచార గృహంపై దాడి.. ముగ్గురి అరెస్ట్

ఖైరతాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గుట్టుగా వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ ఫ్లాటుపై పోలీసులు దాడిచేసి ఇద్దరు నిర్వాహకులతో పాటు ఓ విటుడిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రమంజిల్ నుంచి తాజ్‌కృష్ణా హోటల్‌కు వెళ్లే మార్గంలోని ఓ అపార్టుమెంట్ ఫ్లాట్‌లో వ్యభిచారం నడుస్తుందన్న విశ్వసనీయ సమాచారంతో సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం సాయంత్రం దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని ఖైరతాబాద్ పోలీసులకు అప్పగించడంతో విచారించిన పోలీసులు ప్రధాన నిందితుడైన జి.నరసింహులునాయుడుతో పాటు సహ నిర్వాహకురాలు డి.బూరమ్మ అలియాస్ రుతమ్మ(64), ఓ విటుడిని, ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న రెండు వేల రూపాయల నగదు, కండోమ్స్‌తో పాటు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సైఫాబాద్ డివిజన్ ఏసీపీ సంజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఎస్ఐ సందీప్‌రెడ్డి కేసును విచారించారు.


వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దానం

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

బంజారాహిల్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాన్ని ఫిలింనగర్‌కే తలమానికంగా నిర్మించాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఫిలింనగర్‌లోని వినాయకనగర్ బస్తీ పర్వతాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించనున్న బ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. కొండ ప్రాంతం కావడంతో ఇక్కడ ఆలయాన్ని అద్భుతంగా నిర్మించాలని, అందుకు తన సహకారం ఉంటుందని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు వీరేష్‌చారి, లింగాచారి, విష్ణు, శాంతికుమార్, రవిరాజా, తిరుపతయ్య, సికిందర్‌రెడ్డి, కృష్ణప్రసాద్, నర్సింహాచారి, రవీందర్‌చారి, రమేష్, ఈశ్వర్, శ్రీశైలం, మహేష్ చారి పాల్గొన్నారు.


సమావేశంలో అభివాదం చేస్తున్న వెంకటేశ్ చౌహాన్, మాజీ మంత్రి రవీందర్ నాయక్ తదితరులు

ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర

● లగచర్ల ఘటనలో గిరిజనులను బీఆర్ఎస్ పావులుగా వాడుకుంది
● గిరిజన శక్తి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్ చౌహాన్

పంజాగుట్ట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర జరుగుతోందని, దీనిలో భాగంగానే లగచర్ల ఘటన జరిగిందని గిరిజన శక్తి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్ చౌహాన్ ఆరోపించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి రవీందర్ నాయక్‌తో కలిసి ఆయన మాట్లాడారు. లగచర్ల ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని, జైలులో ఉన్న అమాయక గిరిజనులను వెంటనే విడుదల చేయాలని వెంకటేశ్ చౌహాన్ డిమాండ్ చేశారు. లగచర్ల ఘటనలో గిరిజనులను బీఆర్ఎస్ పార్టీ పావులుగా వాడుకుందని ఆరోపించారు. దాడికి మూల కారణం కేటీఆర్ అని, ఆయన్ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన లంబాడీలను ముందుపెట్టి కేటీఆర్ రాజకీయంగా ప్రయోజనం పొందాలని చూస్తున్నారని ఆయన మండిపడ్డారు. త్వరలోనే గిరిజన సంఘాల ప్రతినిధులు, మేధావులు లగచర్లకు వెళ్లి అక్కడి ప్రజలతోనే మాట్లాడితే నిజాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఈ సమావేశంలో గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్ నాయక్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజయ్య నాయక్ పాల్గొన్నారు.

సమస్యలను త్వరగా పరిష్కరిస్తున్నాం

● కార్పొరేటర్ పి.విజయారెడ్డి

బంజారాహిల్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజల సమస్యలు వేగంగా పరిష్కారం అవుతున్నాయని టీపీసీసీ కార్యదర్శి, కార్పొరేటర్ పి.విజయారెడ్డి అన్నారు. పంజాగుట్ట బస్తీ కమిటీ విజ్ఞప్తి మేరకు ఆమె స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన రూ.15 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో పవర్ బోరింగ్, బెంచీలు, ఆర్వో ప్లాంట్, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులను విజయారెడ్డి బుధవారం పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు.


బోరింగ్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పి.విజయారెడ్డి

డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తాం

● కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

బంజారాహిల్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకుగాను అవసరమైనచోట కొత్త పైప్‌లైన్ నిర్మాణం చేపట్టనున్నట్లు వెంకటేశ్వరనగర్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి తెలిపారు. పంజాగుట్ట ప్రధాన రహదారితో పాటు అంతర్గత రహదారుల్లో డ్రైనేజీ సమస్యలపై స్థానికుల నుంచి ఫిర్యాదులు అందడంతో ఆమె బుధవారం ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ లీకేజీ కారణంగా ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన కార్పొరేటర్ కొత్త పైప్‌లైన్ కోసం నిధులు మంజూరయ్యాయని.. త్వరలోనే పనులను ప్రారంభిస్తామని చెప్పారు.


పొంగుతున్న డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

ఫిలింనగర్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు

బంజారాహిల్స్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం వస్తుందని ఆ పార్టీ నాయకులు అన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్‌లో బుధవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదలైంది. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు సలీం మాట్లాడుతూ.. టీడీపీని కేవలం నాయకులు మాత్రమే వీడారని, కార్యకర్తల బలం అలాగే ఉందన్నారు. సభ్యత్వ నమోదుకు మంచి స్పందన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాల్యావతి, విజయలక్ష్మి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

1400 కిలోల అల్లం వెల్లుల్లి మిశ్రమం సీజ్

● 50 కిలోల సింథటిక్ రంగులు సైతం
● ఆనంద్‌బాగ్‌లో హోటల్, బేకరీలో తనిఖీలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహానగరంలో కల్తీ అల్లం వెల్లుల్లి మిశ్రమం తయారీ జోరుగా సాగుతోంది. పరిమిత స్థాయిలో అల్లం, వెల్లుల్లి వాడుతూ సింథటిక్ రంగులు, సిట్రిక్ యాసిడ్, ఇతరత్రా పదార్థాలను ఈ మిశ్రమంలో కలుపుతున్నారు. కాటేదాన్‌లో తెలంగాణ కమిషనర్ ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు నిర్వహించింది. అక్కడి ఎస్‌కేఆర్ ఫుడ్ ప్రొడక్ట్స్ సంస్థలో 1000 కిలోలు, ఉమాని ఫుడ్స్ ఇంటర్నేషనల్‌లో 400 కిలోల ప్యాకేజ్డ్ కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్, రంగు వచ్చేలా ఈ మిశ్రమంలో కలిపేందుకు ఉంచిన 50 కిలోల సింథటిక్ (టాట్రజైన్) రంగులను స్వాధీనం చేసుకున్నారు. మిశ్రమం తయారు చేస్తున్న కేంద్రాల్లో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, గ్రైండింగ్, వాష్ ఏరియా వద్ద నీటి నిల్వలు, తయారీ, స్టోరేజ్‌లో కనీస ప్రమాణాలు పాటించడం లేదని గుర్తించారు. నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిన అధికారులు.. రెండు తయారీ కేంద్రాలను సీజ్ చేశారు.


అధికారులు సీజ్ చేసిన అల్లం వెల్లుల్లి మిశ్రమం

ఆనంద్‌బాగ్‌లో..

జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారి ఆధ్వర్యంలో బుధవారం ఆనంద్‌బాగ్‌లోని మురుగన్ హోటల్, కాకతీయనగర్‌లోని శ్రీ తిరుమల బేకరీలో జీహెచ్ఎంసీ అధికారులు తనిఖీ చేశారు. హోటల్, బేకరీలో అపరిశుభ్ర వాతావరణం ఉందని గుర్తించి కేసు నమోదు చేశారు.



మహిళకు కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

మహిళల సంక్షేమానికి ప్రభుత్వ కృషి: ఎమ్మెల్యే

సికింద్రాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పేర్కొన్నారు. బుధవారం పికెట్‌లోని క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి పథకం ద్వారా మంజూరైన దాదాపు రూ. 33 లక్షల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. తెలంగాణలో మహిళా సాధికరతకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో అర్హులైన మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

రాంగ్ రూట్‌లో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారకులకులైతే జైలు

బోయిన్‌పల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బోయినపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ అన్నారు. దుకాణాలు, రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలను నిలపొద్దన్నారు. ఆర్టీసీ బస్టాప్‌లలో ప్రైవేట్ వాహనాలు, ఆటోలను పార్కింగ్ చేయొద్దన్నారు. రాంగ్ రూట్‌లో వాహనాలు నడుపుతూ ఇతరులకు ఇబ్బందులు కల్గిస్తూ ప్రమాదాలకు కారకులు అయినవారికి జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పలు విషయాలను వెల్లడించారు.



రవికుమార్, బోయిన్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

ఫుట్‌పాత్‌లను అక్రమించిన వ్యాపారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

రోడ్లు, ఫుట్‌పాత్‌లపై తోపుడు బండ్లు, దుకాణాలు ఏర్పాటు చేయడం వలన ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫుట్‌పాత్ దాటి రావద్దని సూచిస్తున్నాము. సిబ్బందితో కలిసి పలుచోట్ల బండ్లను రోడ్లకు దూరంగా జరిపించాం. అయినా వ్యాపారులు పద్ధతి మార్చు రాకుంటే క్రేన్ సహాయంతో తొలగిస్తున్నాము. కేసులు కూడా పెడుతున్నాము.

రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తీసుకుంట్ను చర్యలు తీసుకుంటున్నారు?

బోయిన్‌పల్లి ట్రాపిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బోయిన్‌పల్లి అంబేడ్కర్ చౌరస్తా, బాలానగర్, సికింద్రాబాద్, మేడ్చల్ వైపుకు వెళ్లే రహదారి, తాడ్‌బంద్ చౌరస్తా, సెంటర్ పాయింట్, శ్రీలత గార్డెన్ చౌరస్తా, మహాత్మనగర్ చౌరస్తా, బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో రద్దీ సమయాలలో సిబ్బందిని పెంచి ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నాము. ముఖ్యంగా ఫ్రీ లెప్ట్‌లలో వాహనాలు రాంగ్ రూట్‌లో వచ్చి వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకుంటున్నాము. అవసరమైతే చలాన్లు వేస్తున్నాము. కేసులు పెడుతున్నాము. భారీ వాహనాలను అనుమతించడంలేదు.

రాంగ్‌రూట్‌లో వెళ్తున్న వాహనదారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

రాంగ్ రూట్‌లో వెళ్తున్న వాహనదారులను అక్కడ విధుల నిర్వహిస్తున్న పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు. వాహనాలను సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తున్నాం. పట్టుబడిన వాహనదారులను కోర్టులో హాజరుపరుస్తున్నాం. మైనర్లు వాహనాలు నడిపిస్తూ పట్టుబడితే తల్లితండ్రులపైన కేసులు పెడుతున్నాము. కౌన్సెలింగ్ ఇచ్చి అనంతరం చలాన్లు వేస్తున్నాము.

ట్రాపిక్ నిబంధనలు పాటించని వారికి మీరిచ్చే సూచనలు ఏమిటీ?

వాహనదారులు కచ్చితంగా వారి వెంట ఆర్‌సీ, లైసెన్స్ ఉంచుకోవాలి. వాహనదారులు హెల్మెట్ ధరించాలి. త్రిబుల్ రైడ్, లైసెన్స్ లేకుండా, మద్యం తాగి వాహనాలను నడిపించొద్దు. నిబంధనలు పాటించకుండా పట్టుబడితే అలాంటి వారిని విడిచిపెట్టాలని ఎవరూ ఫోన్ చేయొద్దు.

విద్యార్థులకు, తల్లితండ్రులకు మీరిచ్చే సూచనలు, సలహాలు?

మైనర్‌లకు తల్లిదండ్రులు వాహనాలను ఇవ్వద్దు. విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా పట్టుబడితే కేసులు తప్పవు. విదేశాలకు వెళ్లి చదువుకోవాలనుకునేవారికి పాస్‌పోర్ట్, వీసాలపైన ఎఫెక్ట్ ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగాలు ఆశిస్తున్నవారు కేసులు లేకుండా చూసుకోవాలి.

నీటి సరఫరా పెంచినందుకు సీఎంకు కృతజ్ఞతలు

సికింద్రాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్‌లో ప్రజల అనుగుణంగా తాగునీటి సరఫరాను పెంచినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకుడు శ్యాంసన్ రాజు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం రసూల్‌పురాలో మహిళలతో కలిసి తాగునీటి నల్లాల వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం శ్యాంసన్‌రాజు మాట్లాడుతూ 2016 నుంచి 5.9 ఎంజీడీ నీటి సరఫరా జరుగుతున్నదని, ప్రస్తుతం పెరిగిన జనాభాకు అది సరిపోవడం లేదన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే శ్రీగణేష్, సీఎం దృష్టికి తీసుకెళ్లగా ఒక ఎంజీడీ నీటి సరఫరాను అదనంగా పెంచాలని వాటర్‌బోర్డు అధికారులను ఆదేశించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్నానగర్ మురళి, పెద్ద నాగరాజు, మహేందర్, యాదగిరి, దర్శి, అస్గర్, నాగేశ్వర్, సత్యనారాయణ, మహేష్, రంగమ్మ, మహేశ్వరి, బాలమణి, రజిత, పద్మ, నర్సమ్మ పాల్గొన్నారు.



నల్లా వద్ద పూజలు చేస్తున్న శ్యాంసన్‌రాజు, మహిళలు

రాజీవ్ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

తిరుమలగిరి నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్‌బజార్, రాజీవ్ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని మహిళలు, పురుషులు కాలనీలో బుధవారం నిరసనకు దిగారు. 20 ఏళ్లుగా డ్రైనేజీ సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు సీఈవో మధుకర్ నాయక్‌కు, ఎమ్మెల్యే శ్రీగణేష్‌కి వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదన్నారు. డ్రైనేజీ మురుగు నీటిలోనే రాకపోకలు సాగించాల్సి వస్తున్నదన్నారు. ఇక వర్షాలు కురిసినప్పుడు మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లి డ్రైనేజీ మురుగు నీరంతా ఇళ్లల్లోకి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగునీరు కారణంగా చిన్నారులు, వృద్ధులు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులబారినపడే అవకాశముందని, ఇంట్లో ప్రశాంతంగా భోజనం కూడా చేయలేని పరిస్థితి ఉన్నదన్నారు. వెంటనే సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డ్రైనేజీ మురుగునీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. నిరసనలో సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్వర్, కబూష్ణ, సావిత్రి, యశోద, జయశ్రీ, నీరజ, రాజలక్ష్మీ, సంధ్య, భావన తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

సీసీ రోడ్డు పనులను నాణ్యతతో చేపట్టాలి



రోడ్డుపనులు ప్రారంభించిన కార్పొరేటర్ హేమను సత్కరిస్తున్న స్థానికులు

బౌద్ధనగర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు పనులను నాణ్యతతో చేపట్టాలని కార్పొరేటర్ సామల హేమ అధికారులకు సూచించారు. సీతాఫల్‌మండి డివిజన్, మోహన్‌రెడ్డి నగర్‌లో రూ. 19 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాం లో మంజూరైన నిధులతో సీసీ రోడ్డు పనులను చేపట్టినట్లు తెలిపారు. స్థానిక సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికులు కార్పొరేటర్ హేమను సత్కారించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, జలమండలి వర్క్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, బీరయ్య, నాయకులు మహాత్మా, రాళ్లబండి విష్ణుచారి, జాకీర్, లలిత తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

తిరుమలగిరి పాత 'పోలీస్ స్టేషన్'

- రాత్రి అయితే చాలు మద్యం మత్తులో హంగామా
- ఇతరుల ఇళ్ల తలుపులు కొడుతున్న మందుబాబులు
- భయాందోళనలో స్థానిక మహిళలు





తిరుమలగిరి పాత పోలీస్ స్టేషన్ భవనం

తిరుమలగిరి నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చీకటి పడిందంటే చాలు తిరుమలగిరి పాత పోలీస్ స్టేషన్ భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పగలు రాత్రి తేడా లేకుండా తాగుబోతు బ్యాచ్ పాత పోలీస్ స్టేషన్ భవనంలోకి వెళ్లి మద్యం తాగి నానా హంగామా సృష్టిస్తున్నారు. మద్యం మత్తులో ఒకరిపై ఒకరు కేకలు వేస్తూ గొడవలకు దిగుతున్నారు. దాంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఏ సమయంలో ఏం జరుగుతుందోనని మహిళలు ఆందోళన చెందుతున్నారు. సమీపంలోని అర్జునవాడ, లాల్‌బజార్ మార్కెట్, పోలీస్ క్వార్టర్స్ ఉండడంతో మహిళలు కొనుగోలు చేయడానికి మార్కెట్‌కు లాల్‌బజార్‌కు వెళ్లి వస్తుంటారు. వీరంతా పాత పోలీస్ స్టేషన్ భవనం మీదుగా రాకపోకలు కొనసాగిస్తుంటారు. అక్కడికి రాగానే గంజాయి బ్యాచ్‌ను, మందుబాబులను చూసి భయపడుతున్నారు. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్నా అధికారులు పట్టించుకోడం లేదంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాత్రి పూట మద్యం తాగిన బ్యాచ్, మత్తులో ఇతరుల ఇళ్లలోకి వెళ్లి తలుపులు కొడుతున్నారని స్థానిక మహిళలు వాపోతున్నారు. గతంలోనూ ఇలాంటి సంఘటనలు జరిగినా పోలీస్ ఉన్నతాధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిరుమలగిరి పాత పోలీస్ స్టేషన్ భవనం సుమారు అర ఎకరం స్థలంలో ఉంది, ప్రస్తుతం వాడుకలో లేకపోవడం వలన చెట్లు ఏపుగా పెరిగాయి. కొంత మంది రాత్రి సమయం అక్కడికి వచ్చి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. జనావాసాల మధ్య తాగుబోతుల బ్యాచ్ వీరంగం సృష్టించినా పోలీస్ అధికారులు అటువైపు చూడడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మఫ్టీలో పోలీసులు పరిశీలిస్తున్నారు

పాత పోలీస్‌స్టేషన్ భవనంలో మద్యం తాగడానికి వస్తున్న వ్యక్తులను పట్టుకోవడానికి మఫ్టీలో పోలీసులు రోజుకు నాలుగు సార్లు అక్కడికి వెళ్లి పరిశీలిస్తున్నారు. పాత పోలీస్‌స్టేషన్ భవనం పరిసరాల్లో తాగుబోతులు మద్యం మత్తులో గొడవలు, అల్లర్లు చేస్తున్నంటు తెలిస్తే స్థానికులు సమాచారం ఇవ్వగానే వెంటనే వెళ్లి వారిని పట్టుకుంటాం. ఇప్పటికే కొందరు వ్యక్తుల పై పెట్టి కేసులు నమోదు చేశాము. స్థానికగా గొడవలు జరగకుండా రక్షక్ వాహనంలో తమ సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు



- నాగరాజు, తిరుమలగిరి ఇన్‌స్పెక్టర్

రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి: రాఘవయ్య

బౌద్ధనగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైల్వేకార్మికుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి ఢిల్లీస్థాయిలో కృషి చేస్తున్నామని జాతీయ రైల్వేకార్మిక సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య పేర్కొన్నారు. బుధవారం చిలకలగూడలో రైల్వే పింఛన్‌దారుల సంఘ అనుబంధ శాఖల వర్క్‌షాపు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాఘవయ్య మాట్లాడుతూ జాతీయ రైల్వే కార్మిక సంఘం, జోనల్ అనుబంధ కార్మిక సంఘాల్లోని రైల్వే కార్మికుల సమస్యలు, సంక్షేమానికి 50 ఏళ్లుగా అలుపెరగని పోరాటం చేస్తున్నామన్నారు. డిసెంబర్ 4,5,6తేదీల్లో జరిగే గుర్తింపు సంఘం ఎన్నికలలో జాతీయ రైల్వేకార్మిక సంఘ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్మికులకు, పింఛన్‌దారులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్మిక వ్యతిరేక విధానాలను సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్‌వీఎస్ రాఘవరావు దుయ్యబట్టారు. వృద్ధులకు పింఛన్ పెంచాలని, పింఛన్‌దారులకు రైల్వేలో రాయితీలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి రామకృష్ణాచార్యులు, సంఘనేతలు బాబునాయక్, రాజేందర్, జయపాల్, బీకే సింగ్, వేముల ముత్యాలు, సంఘ అధ్యక్షుడు ప్రభాకర్ అంద్రూ పాల్గొన్నారు.



జాతీయ రైల్వేకార్మిక సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్యను సన్మానిస్తున్న రైల్వే పింఛన్‌దారుల సంఘం నాయకులు

ఆర్‌బీఐ నిబంధనల మేరకు ఖాతాదారులకు ఆదర్శ్ బ్యాంకు సేవలు



బోయిన్‌పల్లిలో ఆదర్శ్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకును ప్రారంభిస్తున్న ఆర్‌బీఐ రిటైర్డ్ మేనేజర్ శశిధరశాస్త్రి

బోయిన్‌పల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆర్‌బీఐ నిబంధనల మేరకు ఆదర్శ్‌బ్యాంక్ ఖాతాదారులకు సేవలు అందిస్తున్నదని ఆర్బీఐ మాజీ మేనేజర్ శశిధరశాస్త్రి పేర్కొన్నారు. ఏ ఒక్క ఖాతాదారుడు కూడా నిరాశ చెందకూడదనే లక్ష్యంతో ఆదర్శ్ బ్యాంకు పనిచేస్తున్నదని ఆయన అన్నారు. ఆదర్శ్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకు 26వ బ్రాంచ్‌ను బోయిన్‌పల్లి రాంగోపాల్ ఎన్‌క్లేవ్‌లో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన శశిధరశాస్త్రి బుధవారం నూతన బ్రాంచ్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఆదివారం కూడా బ్యాంక్ ఖాతాదారులకు అందుబాటులో ఉంటుందన్నారు. కస్టమర్లకు క్యాష్‌కు ఇబ్బంది కలుగకుండా ప్రతీ బ్రాంచ్‌లో ఏటీఎంలను ఏర్పాటు చేశారన్నారు. ఆర్‌బీఐ నిబంధనలు పాటిస్తూ బ్యాంక్ లాకర్ సిస్టమ్స్ ఉంటాయని శశిధరశాస్త్రి పేర్కొన్నారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ, ఆదర్శ్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకు తన సేవలు మరింతగా విస్తరించాలని ఆకాంక్షించారు. అనంతరం డైరెక్టర్ గంగారావు మాట్లాడుతూ అతిత్వరలో ఆదర్శ్ బ్యాంకు 50 బ్రాంచిలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 8 వందల కోట్ల టర్నోవర్ జరుగుతున్న ఈ బ్యాంక్‌సేవలు వెయ్యికోట్ల టర్నోవర్ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ సీఈవో ఎంవీ రమణ, ఏజీఎంలు నాయుడు, శ్రీనివాసరావు, వెంకటేశం సిబ్బంది పాల్గొన్నారు.

1400 కిలోల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ సీజ్

- 50 కిలోల సింథటిక్ రంగులు కూడా

హైదరాబాద్ సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహానగరంలో కల్తీ అల్లం వెల్లుల్లి మిశ్రమం తయారీ జోరుగా సాగుతోం ది. పరిమిత స్థాయిలో అల్లం, వెల్లుల్లి పేస్టులో సింథటిక్ రంగులు, సిట్రిక్ యాసిడ్, ఇతరత్రా పదార్థాలు మిశ్రమంలో కలుపుతున్నారు. కాటేదాన్‌లో తెలంగాణ కమిషనర్ ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు నిర్వహించింది. అక్కడి ఎస్‌కేఆర్ ఫుడ్ ప్రొడక్ట్స్ సంస్థలో 1000 కిలోలు, ఉమాని ఫుడ్స్ ఇంటర్నేషనల్‌లోనూ 400 కిలో ప్యాకేజ్డ్ కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్, రంగు వచ్చేలా ఈ మిశ్రమంలో కలిపేందుకు ఉంచిన 50కిలోల సింథటిక్(టాట్రజైన్) రంగులను స్వాధీనం చేసుకున్నారు. మిశ్రమం తయారు చేస్తోన్న కేంద్రాల్లో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, గ్రైండింగ్, వాష్ ఏరియా వద్ద నీటి నిల్వలు, తయారీ, స్టోరేజ్‌లో కనీస ప్రమాణాలు పాటించడం లేదని గుర్తించారు. స్వాధీనం చేసుక్ను నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిన అధికారులు.. రెండు తయారీ కేంద్రాలను సీజ్ చేశారు. అనుమతులు రద్దు చేశామని, చట్ట ప్రకారం తదుపరి చర్యలుంటాయని పేర్కొన్నారు. ఎలాంటి బోర్డులు లేకుండా అల్లంవెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తోన్న సంస్థ.. ప్లాస్టిక్ డబ్బాల్లో ప్యాక్ చేసి విక్రయిస్తున్నాయి.



అధికారులు సీజ్ చేసిన అల్లం వెల్లుల్లి మిశ్రమం

ఆనంద్‌బాగ్‌లో...

జీహెచ్ఎంసీ ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ ఆధ్వర్యంలో బుధవారం ఆనంద్‌బాగ్‌లోని మురుగన్ హోటల్, కాకతీయనగర్‌లోని శ్రీతిరుమల బేకరీలో జీహెచ్ఎంసీ అధికారులు తనిఖీ చేశారు. హోటల్, బేకరీలో అపరిశుభ్ర వాతావరణం ఉందని గుర్తించి.. జీహెచ్ఎంసీ యాక్ట్ 1955 ప్రకారం ట్రయల్ కేసులు నమోదు చేశారు.

ఆదిత్య ఎన్‌క్లేవ్ 'నీలగిరి బ్లాక్' ఓనర్స్ కార్యవర్గం ఎన్నిక

అమీర్‌పేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేటలోని ఆదిత్య ఎన్‌క్లేవ్ నీలగిరి బ్లాక్ భవన ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకొన్నారు. విశ్రాంత డిప్యూటీ రిజిస్ట్రార్ కే జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా బి. నవీన్, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణారెడ్డి, కోశాధికారిగా హనుమంతరావు. కార్యవర్గ సభ్యులుగా కె.మనోజ్ కుమార్, బి. వెంకటరమణ, ఎన్. ఉపేందర్‌రెడ్డి, కైలాస్‌చంద్ కేడియా, జి.కృష్ణమూర్తి, జి.రాజశేఖర్, వెంకటేశ్వర్లు, రమేష్ ఎన్నికయ్యారు. అధ్యక్షుడు నవీన్ మాట్లాడుతూ 168 ప్లాట్లలోని ఓనర్స్‌కు ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరిస్తానని అన్నారు.



ఆదిత్య ఎన్‌క్లేవ్ నీలగిరి బ్లాక్ ఓనర్స్ నూతన కార్యవర్గం

నారాయణ విద్యా సంస్థల క్రీడోత్సవాలు ప్రారంభం

అమీర్‌పేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నారాయణ విద్యా సంస్థల ప్రీమియర్ లీగ్ క్రీడోత్సవాలు సనత్‌నగర్‌లోని లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లో బుధవారం ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరుగనున్న పోటీలలో అత్తాపూర్, హైటెక్‌సిటీ, జూబ్లీహిల్స్, మెహిదీపట్నం, మణికొండ, ఎస్ఆర్‌నగర్, విజయనగర్ కాలనీ బ్రాంచ్‌లకు చెందిన నారాయణ పాఠశాల విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, డాడ్జ్‌బాల్, 100,400 మీటర్ల పోటీలలో పాల్గొంటారు. ఈ నెల 23న క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేస్తామని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ గోపాలరెడ్డి, ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసిన కార్పొరేటర్ లక్ష్మి పోటీలను ప్రారంభించారు. వివిధ పాఠశాలల విద్యార్థులను పరిచయం చేశారు. విద్యార్థులు నిర్వహించిన కవాతు, సాంస్కృతికప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల ప్రతినిధులు లక్ష్మీ, శర్వాణి, మాధవరెడ్డి పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కార్పొరేటర్ లక్ష్మి

'పీఎం విశ్వకర్మ' రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి ప్రాతిపాదికన అసంఘటిత రంగంలో చేతివృత్తులు, పనిముట్లతో పనిచేసే వారు ప్రధానమంత్రి విశ్వకర్మయోజన కింద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమశాఖ ఉపసంచాలకులు జి.ఆశన్న తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బీసీ కులసంఘాలు, ఎన్జీఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆశన్న మాట్లాడుతూ కులవృత్తిదారులు, చేతివృత్తిదారులు, పనిముట్ల వృత్తిదారుల నుంచి కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద ఆర్థిక సాయం అందించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతుందని తెలిపారు. ఈ పథకం కింద లక్ష రుణం ఐదు శాతం వడ్డీపై ఇస్తుందని, దరఖాస్తు చేసుకున్న వారికి శిక్షణివ్వడం, ఆ సమయంలో స్టయిఫండ్‌తో పాటు సర్టిఫికెట్ ప్రదానం చేస్తామని తెలిపారు. లక్ష రూపాయల రుణం 18 నెలల్లో తిరిగి చెల్లించిన వారికి మళ్లీ రూ.2లక్షల రుణమిస్తామని తెలిపారు. దరఖాస్తుదారుడు చేతివృత్తులు, పనిముట్లతో పని చేస్తున్న హస్త కళాకారులు, వృత్తి కళాకారులు పీఎం విశ్వకర్మ పథకానికి అర్హులన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకునే నాటికి లబ్ధిదారుల వయస్సు కనీసం 18 ఏళ్లు ఉండాలని వివరించారు. ఈ పథకం కుటుంబంలో ఒకరికి మాత్రమే పరిమితమని, అర్హతకలిగిన కులవృత్తులవారు కామన్ సర్వీస్ సెంటర్‌కు వెళ్లి https://pmvishwakarma.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా సర్వే ఆఫీసర్ వి.శ్రీరామ్, మైనార్టీ సంక్షేమ అధికారి ఇలియజ్ అహ్మద్, సహాయ అభివృద్ధి అధికారులు టీ.నరసింహులు, డి కృష్ణమాచారి వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమశాఖ ఉపసంచాలకులు ఆశన్న

2న ఉజ్జయినీ మహాకాళి ఆలయ హుండీ లెక్కింపు

సికింద్రాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళీ ఆలయ హుండీల లెక్కింపు డిసెంబర్ 2 జరపనున్నట్లు ఆలయ ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి తెలిపారు. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, మాజీ ట్రస్టు బోర్డు సభ్యులు, భక్తుల సమక్షంలో హుండీల లెక్కింపు జరుగుతుందని బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బోయిన్‌పల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, చెట్లకొమ్మలను నరికివేతకారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని డీఈ గోపాల్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సీతారాంపురం, గణేష్‌నగర్, మర్రిరామ్‌రెడ్డి కాలనీ, యాదవ్‌బస్తీ, కళ్యాణి టాకీస్, బృందావనం కాలనీ, సిండికేట్ బ్యాంక్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. ప్రియదర్శిని, అలీ కాంప్లెక్స్, బడాగూడ, ఓల్డ్ బోయిన్‌పల్లి, లాస్ట్ బస్‌స్టాప్, లక్కీ హోమ్స్ శ్రీసాయి ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ తెలిపారు.

ఇంటింటికి వెళ్లి సర్వే చేయని ఎన్యూమరేటర్‌పై విచారణ

బౌద్ధనగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికి వెళ్లి సమగ్ర కుటుంబ సర్వే చేయని ఎన్యూమరేటర్లపై అధికారులు విచారణ చేపట్టారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన నామమాత్రంగా కుటుంబ సర్వే, ఒకేచోట కూర్చొని వివరాలు సేకరిస్తున్న ఎన్యూమరేటర్ కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం వారాసిగూడ పోచమ్మ ఆలయం వీధిలో కుటుంబ సమగ్ర సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్, ఆశావర్కర్‌పై బుధవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా రెండు రోజులుగా ఇంటింటికి వెళ్లకుండా ఓకేచోట కూర్చొని కుటుంబ వివరాలు సేకరిస్తుందని స్థానికులు విచారణాధికారిణికి వివరించారు. బ్యాంక్‌లో లోన్ తీసుకున్నారా? అప్పులు ఉన్నాయా అంటూ బజార్‌లో అందరి ఎదుట ఎన్యూమరేటర్ అడిగిందని అని స్వాతి అనే మహిళ విచారణ అధికారిణి ఎలిజబెత్‌కు వివరించింది. కుటుంబ వివరాలు పదిమందిలో చెప్పాలా అని పలువురు మహిళలు ప్రశ్నించారు. ఇంటింటికి వచ్చి వివరాలు సేకరిస్తే తమ కుటుంబ విషయాలు బయటవాళ్లకు తెలిసేవికావన్నారు. ఇప్పటికైనా ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించేలా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



భిక్ష చేస్తున్న అయ్యప్ప స్వాములు

మణికంఠ ఆలయంలో 60వ రోజూ నిత్యాన్నదానం

అమీర్‌పేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బల్కంపేట సైంటిఫిక్ కాలనీలోని వీరాంజనేయస్వామి, స్రాయిమణికంఠ దేవాస్థానంలో నిత్యాన్నదాన కార్యక్రమం బుధవారం నాటికి 60వ రోజుకు చేరుకుంది. సెప్టెంబర్ 20న ప్రారంభమైన అన్నదాన కార్యక్రమాన్ని జనవరి 10 వరకు కొనసాగించనున్నట్లు ఆలయ ప్రధాన కార్యదర్శి కే. ప్రభాకరచారి వెల్లడించారు. రోజుకు సగటున 400 మంది అయ్యప్పస్వాములు ఆలయంలో భిక్ష చేస్తున్నారు. అన్నదానంతోపాటు వసతి సౌకర్యం కూడా ఏర్పాటు చేశామని చెప్పారు.

అతిగా మద్యం తాగిన యువకుడి మృతి

బౌద్ధనగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం తాగిన యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అడ్మిన్ ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం... అడ్డగుట్ట లోయానగర్‌కు చెందిన ఎం.విశాల్(28) పెయింటర్. మద్యానికి బానిసైన విశాల్ పదిరోజుల క్రితం తల్లితండ్రులతో గొడవ పెట్టుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం పార్సీగుట్టలోని ఓ మద్యం దుకాణం ఎదుట రోడ్డు పక్కన ఓ యువకుడు అపారకస్మితిలో ఉన్నాడని స్థానికులు సమాచారం ఇచ్చారు. అక్కడికి వెళ్లిన పోలీసులు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వగా, వారు వచ్చి పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. విశాల్ తల్లి మైలారం పద్మాలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అడ్మిన్ ఎస్ఐ సుధాకర్ తెలిపారు.